వారం వారం

నా చిన్నతనంలో మా దొడ్డమ్మ పొంగరాలు పోస్తూవుంటే నేను దగ్గర కూర్చుని ధ్యానంచేస్తూ ఉండేవాణ్ణి. ఇప్పుడు సాహిత్య లోకంలో చాలా మంది దొడ్డమ్మలు పొంగరాలు పోస్తున్నారు. కొన్ని తగలడి పోతున్నాయి. కొన్ని రుచిగానే ఉంటున్నాయి. ఎప్పుడో కాని అసలైన పొంగరం పడదు. న్యూనోపమానం అనుకున్నాసరే అసలైన పొంగరం వెయ్యడంవంటిదే సిసలైన కావ్యం రాయడం కూడా. అశాశ్వతమైన ఈ ప్రపంచంలో శాశ్వతమైన పొంగరం అనేది అసంభవం.

తీర్చి దిద్దిన తాజ్‌మహాల్ కూడా కొన్ని సహస్రాబ్దాలలో విస్మృత మవుతుంది. తూచినట్లుగా అన్నిపాళ్లూ సరిపోయి, ఆకారంలో ఆకర్షణతో ఆ సమయానికి ఆలి తీర్చినదే పొంగరం. (అమ్మకం కోసం పొంగరం వేసేటప్పుడు బయలుదేరే భయంకరమైన సమస్యలు కూడా వున్నాయి. వస్తూత్పత్తి వుపయోగించడానికా లాభం సంపాదించడానికా అనే సమస్య పరిష్కారం చేసుకోవడానికి ఒక పెద్ద యుద్ధం ప్రస్తుతం జరుగుతోంది. లోగడ 1914 లో ప్రారంభమైన యుద్ధమే ఇది. అప్పటిలాగే ఇప్పుడు కూడా దీన్ని తాత్కాలికంగా ఆపి, మరో వాయిదాలో మరింత పట్టుదలగా చర్చించడానికికొన్ని సన్నాహాలుజరుగుతున్నాయి)

ఆకలి తీర్చడానికే కదా అని అడ్డగిడ్డంగా ఏదో ఒక పొంగరంచేసి అయిం దనిపించడం మా దొడ్డమ్మకి నచ్చదు; ఆవిడ ధోరణిలో ఆవిడకూడా ఒక గొప్ప ఆర్టిస్టు కాబట్టి పొంగరం అయినా తాజమహాలయినా చేసిందేదో బాగా చెయ్యడమే కళ. నన్నయ పద్యానికే కొంచెం మెరుగుపెట్టి పంపించాడట తిక్కన. పనివాడితనం అంటామే అదే నిజమైన కళాజీవికి లక్షణం. ఇది వ్యక్తిగతం (subjective) అయినప్పటికీ దీని నిర్ణేత రసజ్ఞుడే కాబట్టి, రసం సామాజికనిష్ఠం కాబట్టి. ఎరుటివాడు ఆనందించేదాకా రచనకు కావ్యార్హత లేదు కాబట్టి పనివాడితనం objective reality కూడా అని చెప్పక పప్పదు.

సామాజికులు అజ్ఞానంలో మునిగివున్నంత కాలం చేతకానివాళ్ళు శిల్పం పేరిట మోసాలు చెయ్యడానికి వీలుంది. ఇందుకు ధనలాభం అనే అదనపు ఆకర్షణకూడా తోడ్పడుతోంది. అన్నిటిలాగే కళకూడా ధనార్జనకే ఒక మార్గం అయిపోయింది. ధనస్వామ్య వ్యవస్థ అనే జంబుఖానా కింద శిల్పం చిక్కుకున్నంత కాలం ఈ వుక్కిరి బిక్కిరి తప్పదు.

ఏ పరిస్థితులలో శిల్పం పుడుతుందో ఆ పరిస్థితుల ప్రభావం ఆ శిల్పంమీద వుండి తీరుతుంది. పరిస్థితుల ప్రాబల్యాన్ని తప్పించుకుందామనే తహతహ మాత్రమే కళాజీవి కనబరచగలడు గాని ఎన్నడూ దానిని అధిగమించలేడు. అయితే ప్రతికూల వాయువులు ఎంత తీవ్రంగా వీస్తూ వుంటే అంత దృఢంగా వాటి నెదుర్కొని సాగించే పోరాటంలోనే ఉత్తమ శిల్పానికి ప్రోత్సాహం వుంది.

అసాధ్యాన్ని సాధించడానికి మార్గాలు అన్వేషిస్తున్నప్పుడు కళాశాలి అనుభవించే అశాంతిలోనే మహాకావ్యం ఆవిర్భవిస్తుంది.

Sole Distributors for Madras Presidency

THE POPULAR SWADESHI STORES

Triplicane — Madras